దొట్ల నారాయణమూర్తి రాజు

ధూది పులి

ఆ ఉదయం ఐదుగంటలవేళ సుభద్రమ్మగారు కోపంతో వేడెక్కి వూగిపోతూ చిందులు తొక్కేరు. అప్పుడే చీకట్లు చీలుతున్న ఆ సమయంలోనే అయ్యగారు లేచారు. అలవాటుగా బెడ్ కాఫీ కోసం వేచిచూసారు. కానీ రాలేదు. ఏ మంత్ర సిద్ధులుగల మహానుభావుడైనా కాలాన్ని ఒక్కక్షణం ఆపుదాంవని సరదాపడ్డా ఆపగలడేమోగాని అమ్మగారి చేత అయ్యగారికి ఆ సమయంలో బెడ్ కాఫీ ఇప్పించటం మాత్రం ఆపలేడు.

కానీ ఇవాళ ఏ మాయల పకీరు ఆపగల్గేడు? ఏ మాయల పకీరూ ఆపలేదు. సుభద్రమ్మగారే ఇవ్వడం మానీసేరు. నలభై ఏళ్ళగా వస్తున్న అలవాటు ఆరోజెందుకు ఆగిపోయిందో కారణం తెలీదు.

"ఏమేవ్" మంచమ్మీంచి లేవకుండానే కేకపెట్టారు అయ్యగారు. ఆ కేకకు మరో రోజునైతే టక్కున జవాబొచ్చేదే కాని ఈ రోజు మాత్రం జవాబు రాలేదు. రెండోసారి కేక పెట్టేరు. ఈసారీ జవాబులేదు. కానీ స్వయంగా సుభద్రమ్మగారే ఏంవలా అరుస్తున్నారంటూ గదిలో కొచ్చారు. గదిలో కొచ్చిన

అమ్మగార్ని అయ్యగారు పరిశీలించి చూసేరు. తెల్లవారు ఝామున నాలుగ్గంటలకే లేచి మడిగా స్నానంచేసి జరీ అంచు ఎర్రటి పట్టుచీర, ఎర్రటి జాకెట్టుల్లో ఆవిడ లైటు వెలుగులో ధగధగా మెరిసిపోతున్నారు. ధగధగా మెరిసి పోతున్న ఆవిడ ముఖంలో ఆ సమయంలో కనిపించిన కోపచ్ఛాయలు అయ్యగారు గుర్తించినా ఆ కోపానికి కారణమేమై వుంటుందో మాత్రం ఆయన వూహకు అందలేదు.

"ఏఁవండీ . ఏవలా ఇంత పొద్దునే భద్ర కాళీ అవతారం దాల్చేరూ" అని నవ్వును ముఖంలో పులుముకోబోయి తెల్లటి ఆవిడ ముఖంలో కనబడ్డ ఎర్రటి కోపాన్ని గ్రహించి నవ్వు నాపేసారు.

"ఔను అందరికీ వేళాకోళంగానే వుంటుంది. ఇల్లూ వాకిలీ ఏమైపోతే ఎవడిక్కావాలి. సంసారమంతా ఏ నట్టేట్లో కలిసిపోతే ఎవడిక్కావాలి" అయ్యగారికి ఆ మాటల తాలుకా అర్థమేం బోధపడ్లేదు. అసలు సంగతేవిటో అడుగుదామనుకునే సరికి అమ్మగారు అగది దాటేసారు. అయ్యగారికి వంటింట్లోంచి వచ్చే చప్పుళ్ళు వినబడుతున్నాయి. నోట్లో సణుక్కుంటున్న సుభద్రమ్మగారి మాటలూ వినబడుతున్నాయి. మరి లాభంలేదు. లేచి వంట గది గుమ్మందగ్గర నిలబడ్డారు. కాఫీని కప్పులో పోసి వెనక్కు తిరిగే సరికి ఎదురుగా అయ్యగారు, అమ్మగారి చేతిలో కాఫీనందుకున్నారు. అయ్యగారు వంటగది దగ్గరకొచ్చి కాఫీ తీసుకున్నా, చిరాగ్గానే కాఫీ నందిచ్చేరు తప్ప అమ్మగారి కేమాత్రం తన చికాకు తగ్గలేదు. తెల్లవారుతున్న కొద్దీ చీకటి తగ్గిపోతున్న కొద్దీ ఆవిడ కోపం ఎక్కువౌతూ వచ్చిందే తప్ప ఒక్క అరడిగ్రీ కూడా తగ్గలేదు.

కొత్తగా కట్టిన మేడింటిమీదకు కొత్తగా వచ్చిన చుట్టంలా మెల్లమెల్లగా సూర్యుడు వెలుతుర్ని మోసుకొచ్చేడు.

అంత ఉదయాన్నే తల్లి వేస్తున్న రంకెలకు పెద్దోళ్ళిద్దరికీ మెలుకువొచ్చినా లేవటానికి బద్ధకంవేసి మంచాన్ని కావలించుకుని ముసుగు తన్నేసేరు. మూడోవాడికి తల్లి కేకలకు నిద్ర ఎగిరిపోయింది. కానీ లేచి ఏం చెయ్యాలో తెలీక మంచమ్మీదే వాడు మఠం వేసుక్కూచుని చుట్టూ చూస్తున్నాడు. నాలుగోది ఐదేళ్ళు నిండిన ఆడపిల్ల మాత్రం హాయిగా నిద్ర పోతోంది.

అప్పటికీ పెరట్లో జాంచెట్టుమీది కాకుల జోడీ టపటపమని రెక్కలు విదిల్చి, మనుష్యులు 'హాయ్' అనుకున్నట్లుగా "కావ్ కావ్" మన్నాయి.

"దిక్కుమాల్ని కాకులు ఇంత పొద్దున్నే తగలడాలా" తనలో తను అనుకున్నట్టుగా గట్టిగానే విసుక్కున్నారు సుభద్రమ్మగారు.

సరిగ్గా అలా విసుక్కుంటున్న సమయంలోనే జోగులొచ్చేడు. జోగులంటే ఆ యింటి పనివాడు. ఉదయాన్నే ఆరుగంటలకల్లావచ్చి నూతిలో నీళ్ళు తోడ్డం, ఆ తర్వాత మొక్కలకు నీళ్ళు పొయ్యడం, ఆ పిదప బజారుకెళ్ళి కూరగాయలు తేవడం, తొమ్మిది గంటలకు చిన్నపిల్లలిద్దర్నీ సైకిలుమీద కాన్వెంటుకు తీసికెళ్ళి దిగబెట్టడం, మధ్యాహ్నం ఇంట్లో పనులేమైనా వుంటే చెయ్యడం, సాయంత్రం కాన్వెంటునించి పిల్లల్ని ఇంటికి తీసుకురావడం పిల్లలకు స్నానం చేయించి షికారుకి తీసుకెళ్ళడం అతని డ్యూటీ. ఆపనికి అతనికి నెలకో రెండు పదులిస్తారు.

"ఒరే మేం పెట్టిన తిళ్ళు, మేమిచ్చిన డబ్బూ అలా చేస్తాయిరా. ఇక్కడ కొచ్చిన మొదట్లో బాగానే వుంటారు. రెండో నెల్నించీ మొదలు ఇష్టమొచ్చినప్పుడు రావడాలు. ఒరే దీనికి మిమ్మల్ననేం ప్రయోజనం లేదురా. తప్పంతా మాదే మాదే. ఏమైనా అంటే ఆ మాత్రంచేస్తే ఏ యింట్లోనైనా ఇంతకంటే ఎక్కువే పడేస్తారనే గీర్మానాలు. ఇవి మంచికి రోజులు కావురా నాయనా."

జోగులు రావడం చూసి, జోగులికి స్వాగతం పలికేరు అమ్మగారు. జోగులు ఏం చెయ్యాలో తెలీక చేతులు కట్టుకుని తలదించుకుని నిలబడ్డాడు. అమ్మగారు గదిలో కాఫీ కలుపుతూ జోగులుకి "అక్షింతాలు" వేస్తూనే



వున్నారు. వరండామీద నిలబడ్డ జోగుల్ని "ఇల్రారా" అని పిల్చి రెండు కాఫీ కప్పులిచ్చి "వెళ్ళి ఆ నిలువు గాడిదకి, ఆ అడ్డ గాడిదకీ ఇచ్చిరా" అన్చెప్పి "అక్కడ వాళ్ళతో సిన్మా పాసులికి తగలడక వేగరం ఇచ్చీసొచ్చి ఆదెష్ట ముండ ఇంటికెళ్ళి దాన్ని అర్జంటుగా పిల్చుకురా" అని గట్టిగా చెప్పేరు సుభద్రమ్మగారు.

"అలాగే నండమ్మగోర"ని వూఁకొట్టాడు.

క్రింద తల్లి మాటలు వినబడుతున్నాయి. కానీ ఏవిటో అర్థం కాలేదు. కాఫీ తెచ్చిచ్చిన జోగుల్ని అడిగారు పాతికేళ్ళు నిండిన భాను . శ్రీనూను.

"అదేంటో బాబూ నాకూ తెలీకండావుంది. రేత్రి నాను చిన్మాకెళ్ళినాను. పన్లోకి రాటం నేటయిపోంది. అచ్చింతాలు పడిపోనాయి." జోగులు గబగబా మెట్లుదిగి వంటగది గుమ్మం దగ్గర హాజరై పోయాడు.

"దేభ్యంలా మొహం పెట్టుకుని నిలబడ్డావేంరా. వెళ్ళు. వెళ్ళి ఆ మహారాణీగార్ని తీసుకురా. వుత్సవాలూ వూరేగింపులూ అయ్యాక రెష్టు తీసుకుంటోంది గావాల. నిలబడిందాన్ని నిలబడ్డట్టుగా తీసుకురా."

అమ్మగారి మాటతోనే వీధిలోకి పరుగెత్తాడు జోగులు. వుత్సవాలు వూరేగింపులూ అయ్యాక రెస్టు తీసుకున్న మహారాణీ ఎవరో వాడికి తెల్సు. అంచేతే గబగబా నడవడం మొదలెట్టేడు. సందులన్నీ తిరిగి అడ్డదారంట నడిస్తే మహారాణీ గారింటికి పావుగంట పడుతుంది. త్వరగా తీస్కు వెళ్ళకపోతే అమ్మగారు ఇంకెన్ని దీవనలు దీవిస్తారేమోనని పరుగులాంటి నడక నడుస్తున్నాడు జోగులు.

మహారాణీవుండే పేటొచ్చింది. వూరుకి చివర నానాజాతుల పేట దాని పేరు. పేట మధ్య మర్రిచెట్టు నానుకొనివున్న కమ్మిల్లు మహారాణీది. జోగులు పాక దగ్గరకెళ్ళేసరికి పాక ముందు చిన్న పందిరీ, పందిరికి కట్టిన తోరణాలు రాలడానికి సిద్ధంగా వున్నాయి. పందిరి సరుగుడు రాట్లకి కట్టిన రంగు కాగితాలు సగం సగం చిరిగి క్రిందకు వ్రేలాడుతున్నాయి. పందిరి పైన కప్పిన కొబ్బరాకులు రాలి నేలంతా చిందర పందరగా వుంది. ఆ కొబ్బరి రేకుల్ని కాళ్ళతో పట్టిలాగుతూ ఓ గజ్జి కుక్క 'గుర్, గుర్' మని గుర్రుపెడుతోంది.

జోగులు గుడిసె ముందుకెళ్ళి, అమ్మగార్ని జ్ఞాపకం తెచ్చుకుని, కావాల్సినంత కరుకు తనాన్ని కంఠంలోకి తెచ్చుకుని "పైడమ్మా. పైడమ్మా" అని పిల్చేడు.

పైడమ్మ పలకలేదు.

రెండోసారి పిల్చేడు. కానీ రెండోసారి కూడా అలికిడిలేదు. పిలుపుకి పక్క గుడిసె లోంచి పైడమ్మ రెండో కూతురు అప్పచ్చి వచ్చి "అమ్మనేదు. అప్పని బస్సుకు దిగెడ్డాని కెళ్ళింది. అలా పన్లోకి నచ్చేస్తాననంది."

"అమ్మగారు ఫైరయి పోతన్నారు. అగ్గి బుగ్గయి పోతన్నారు. ఇలా బస్సు స్టేండు కెల్తాను. నేటవుద్ది అని కబురంపితే ఏటయి పోద్ది. కబురైనా ఎట్టిందికాదు. ఎంత నేటవుద్దో. ఎవర్తినీ తీసుకెళ్ళ కండా ఎళితే నా కాళ్ళిరగ తంతుందావిడ. నువ్వెరా మీఅమ్మొస్తే వచ్చీదూ గాని "

"ఇల్లో" అని సంశయం వెళ్ళబుచ్చింది అప్పచ్చి.

"ఆ పక్కోల్లో ఇప్పుడే వచ్చేస్తానని చెప్పి రాయే" సలహా యిచ్చేడు జోగులు.

"ఏఁవిటీ తెల్లవారుఝామునించీ అలా చిందులు తొక్కుతున్నావు." అయ్యగారు స్నానమదీ కానిచ్చి పూజగదిలో కెళ్ళబోతూ అమ్మగారి "మూడ్" చూసుకుని అడిగేరు.

"గదిలో కెళ్ళబోతూ అడగడమెందుకు లోని కెళ్ళరండి " అని ప్రసన్నంగానే సమాధాన మిచ్చేరు అమ్మగారు.

అయ్యగారు పూజగదిలో ఓ పావు గంట సేపు గడిపి ఇంచక్కా వచ్చేరు. అమ్మగారు ఆ సమయంతో ద్వారబంధాని కానుకుని నిల్చున్నారు.

"ఏం. ఇప్పటికైనా తెల్సిందా" అన్నారు.

"ఏఁవిటి నీ బొంద. సరిగ్గా చెప్పి ఏడవ రాదూ. బోడి సస్పెన్సు."

"ఈ ఏభై ఏళ్ళకే చత్వార మొచ్చిందా మీకు. దేవుడి గదిలో వెళ్ళేం చేసేరు. పూచేసారా లేక నిద్రపోయేరా."

"ఏదో చేసాను. అసలు సంగతి చెప్పు."

అమ్మగారు ఏం చెబుతారో అని అయ్యగారు శ్రద్ధతో నించున్నారు. అమ్మగారు చెప్ప బోయి నీళ్ళకుండీ ప్రక్కగావచ్చి నిల్చున్న వ్యక్తిని చూసి ఆగిపోయారు.

ఆ వచ్చిన వ్యక్తి అప్పచ్చి.

"ఏఁవే యువరాణీ. మీ తల్లి మహారాణీ ఏదీ-కబుర్లు పంపి కార్లూ విమానాలు పంపితేనే గాని రారాపే. అంట్లు తోఁవుకున్న అలగా వెధవలైనా ఎంత పొగరే మీకు. ఆ వూరేగడాలు అయ్యాయా ఇంకేపైనా మిగిలాయా."

ఆధాటికి అప్పచ్చి బిక్కచచ్చిపోయింది.

"అప్పని బస్సుకు దిగెడ్డాని కెళ్ళిందమ్మ" ఆ మాట ఆ గొంతులోంచి ఎలా వచ్చిందో తెలీదు.

"అయితే ముద్దులూ ముచ్చట్లూ ఇంకా అవ లేదన్నమాట. అవ్వే అవ్వు. మీ షోకులూ షికార్లు మమ్మల్ని తిండాని కొచ్చినట్లున్నాయి." అనేసి "ఈ పూట దాన్దర్శనవేపైనా ఇప్పిస్తాదా నీ దర్శనవేనా" ఆ మాటేటో అర్థం కాలేదు అప్పచ్చికి. ఆ మాటకి జోగులు జవాబు చెప్పేడు.

"ఇక నొచ్చేస్తాదమ్మగోరూ "

ఏం చెయ్యాలో, ఇంటికెళ్ళిపోడవో, వుండవో బోధపడక అప్పచ్చి గోడకానుకుని నిల్చుంది.

లోనికెళ్ళి ఎప్పుడొచ్చారో ఏమో అమ్మగారు "ఏవే కుందన్బొమ్మలాగ అలా చూస్తూ నిలబడ్డావు. వెళ్లి ఆ అంట్లకు తగలడు" అని కసిరేరు. అప్పచ్చి అంట్ల గిన్నెలవేపు నడిచింది.

సుభద్రమ్మగారి కోపం తగ్గదు. రానురానూ అది ఎక్కువై వుప్పెనలాగ అది ఆవిడగుండె నిండా నిండిపోయింది. ఆ పొంగిపోతున్న కోపం బైటకు రావటానికి అవకాశంలేదు. ఆ అవకాశం అమ్మగారికి ఏ క్షణాన్నయినా రావొచ్చు. ఆ క్షణం కోసమే సుభద్రమ్మగారు వేచి చూస్తున్నారు.

ఆ సమయం రానే వచ్చింది. వచ్చిన సమయం ఎనిమిది గంటలు. పరుగులెత్తే వచ్చిందో, నడిచే వచ్చిందో, పరుగులాటి నడకే నడిచిందో తెలీదు గేటు గొళ్ళెంతీసి

లోని కొచ్చింది పైడమ్మ. గాభరాగా, పెరడు వేపుకి రావడానికి నడక జోరు ఎక్కువవడంవల్ల ఆవిడ నేలమీద నడిచిందో, అమ్మగారు ముచ్చటగా పెంచుకుంటున్న పూలమొక్కలమీదే నడచిందో మనకు తెలీదు.

బీరువాలోంచి ఇస్త్రీ బట్టలు తీసి అయ్యగారికిచ్చి మధ్య గదిలోంచి పెరటి వరండామీద కొస్తున్న సుభద్రమ్మగారికి మొక్కలమీద నుంచి నడిచొస్తున్న పైడమ్మ కనబడింది.

అమ్మగారు తెల్లవారుఝామున నాలుగు నించీ వేచి చూస్తున్న సమయం అది. ఆవిడలో పొంగిన కోపం కడలి మధ్య పొంగిన బడబాగ్నిలా ఆ సమయంలో ఆవిడ ముఖంలో ప్రతిఫలించింది. ఆ సమయంలో ఆవిడ ఏం చేస్తుందో ఆవిడకే తెలియని పరిస్థితిలో వుందావిడ.

"ఎంతల్లీ తీరికయ్యిందా. గుర్తొచ్చావా" అమ్మగారి మాటలను విని పైడమ్మ ఆగిపోయింది.

"ఆలిస్సెమైపోయిందమ్మా ఆలిస్సెమై పోయింది. దిక్కుమాలిన బస్సు నేటయింది. పిల్లని ఎక్కించొచ్చేసరికి ఇంత టయాం పట్టిందమ్మా" అని "ఇక్కడ బిగాల పనిచేసుకుని బేంకేజెంటు గారింటికెల్లాలమ్మా. బేగి అంట్లు పడేయండమ్మ" అని కూడా అంది.

"బానే ఎల్తావే ఎల్తావు. ఇక్కడికి తెల్లవారు ఝామునే వచ్చి పాపం అలిసిపోయావు. ఎల్లే అమ్మా ఎళ్ళు. ఆ బేంకేజెంటుగారిల్లే నీకు ముఖ్యమై పోయిందన్నమాట. ఆల్లే ఇస్తున్నారే నీకు డబ్బు మేమివ్వలేదే." కోపాన్ని ఇంకో దిక్కుగా కేంద్రీకరించి అరచినంత పన్చేసారమ్మగారు.

"అదేంటండమ్మగోరుఆమాట. మీయందరి దయుంటేనే మాలాటోల్లం మనగలువుతావమ్మా. మీ యందరి దయుంది గాబట్టే పెద్దానికి నాలుగక్షింతాలు ఏయించాను. మీ యందరి దయుంది గాబట్టే దాన్నో ఇంటిదాన్ని సేయించగల్గేను. మీ యందరి దయుంది ." తన పెద్ద కూతురు సీతాలు పెళ్లి ఈ ఆఫీసర్ల పెళ్ళాలే దగ్గరుండి చేయించినట్టుగా, వీళ్ళిచ్చిన డబ్బుతోనే ఆ పెళ్ళి జరిగినట్టుగా, వీళ్ళ దయవల్లే పెద్ద కూతురు ఓ ఇంటిదాయి అయినట్టు అతి వినయంగా, అమాయకంగా మాట్లాడబోయింది పైడమ్మ.

పైడమ్మని చెప్పనివ్వలేదు సుభద్రమ్మగారు.

"ఏఁవే ఇల్రాయే" అని పిల్చిందావిడ.

అంట్ల గిన్నెలవేపు వెళ్ళబోయి అక్కడ కనబడ్డ అప్పచ్చిని "నువ్వెందుకే ఇక్కడ కొచ్చేవ్. ఇంటికి బేగి పారెల్లు. దిక్కుమాలిన నంజ బేగెల్లే" తిట్టి, లోన్నించి 'ఏఁవే ఇల్రాయే' అని పిల్చిన అమ్మగారి పిలుపుకి సమాధానంగా పిలుపొచ్చిన దగ్గరికి క్షణంతో వెళ్ళి నిలబడింది పైడమ్మ.

సుభద్రమ్మగారు పూజ గదిలో వున్నారు. గదిలో గోడుంది కాని అది కనబడటంలేదు. దాన్నిండా పురాణ పురుషులైన దేవదేవుల ఫొటోలు మేకులికి వ్రేలాడదీసి వున్నాయి. ఆ ఫొటోలికి ఎప్పుడో వేసిన దండలు వాడిపోయున్నాయి. కొన్ని ఫొటోలకున్న కొన్ని దండలు తెగిపోయి సగం సగం జారుతూ నిల్చున్నాయి. కొన్ని క్రిందపడి మూల్గుతున్నాయి. ఆఫొటోల గోడకానుకుని వెండి పూజామందిరముంది. ఆ మందిరంలో ఘనత వహించిన దేవుడెవరో వున్నారు కానీ ఆయన రంగు రంగుల రకరకాల పువ్వుల మధ్య వుక్కిరి బిక్కిరౌతూ దర్శన మివ్వలేక పోతున్నారు. ఆ మందిరమ్ముందు ఖరీదైన అగరువత్తులు వెలిగించడం వల్లనేమో ఆ గదంతా ఖరీదైన భక్తికి నిదర్శనంగా ఖరీదైన వాసన వేస్తోంది. ఆ మందిరం ముందు రకరకాలైన పూజ సామాన్లువున్నాయి. అవి కొన్ని వెండితో చేసినవీ, కొన్ని బంగారంతో చేసినవీనని అమ్మగారు చెప్పినమీదట తెల్సిన విషయం అది.

"ఏటండమ్మగోరు పనేటి" అని పైడమ్మ భయంగా అడగబోయేటంతలో "ఇదిగో ఇటు చూడ"ని అన్నారమ్మగారు. అమ్మగారు "ఇటు చూడ"ని అనగానే పైడమ్మ "ఆ ఏటిచూసింది" అమ్మగారు చెయిపెట్టిచూపెడుతున్నారు. అమ్మగారు చూపెట్టేది పూజామందిరం ముందున్న దీపాల్ని.

ఆ దీపాలు వెలుగుతున్నాయి. కల్తీలేని స్వచ్ఛమైన నూనె పొయ్యడం వల్లనేమో ఆ దీపాలు స్వచ్ఛంగా వుజ్జ్వలంగా వెలుగుతున్నాయి.

"ఏటండమ్మగోరు" అంది పైడమ్మ అమాయకంగా.

"ఏటండమ్మగారూ ఏటే . దేష్టముందా. ఇటు చూసావా" అన్నారు అమ్మగారు.

"సూస్తన్నాను" అంది పైడమ్మ.

"గదిలో కొచ్చిచూడు" అన్నారమ్మగారు. గదిబైట ఒకడుగుంచి గదిలోపల ఒకడుగు వేసి ఆ వెలుగుతున్న దీపాలవేపు చూసింది పైడమ్మ. కానీ ఏవర్థం కాక అమ్మగారి వేపు అయోమయంగా చూసింది.

"అర్థమైందా లేదా"

"కాలేదన్లేదు" పైడమ్మ. అసలేవీ అన్లేదు పైడమ్మ. ఏవండానికీ ఏఁవీ అర్థం కాలేదు. అంచేత అలా నిలబడి దీపాలవేపు అమ్మగారి మొఖంవేపు అలా చూస్తోంది పైడమ్మ.

"సూదులు పొడ్సుకుచూడు. బాగా కనబడతాయి. కళ్ళుపొరలు కమ్మేయా. కళ్ళు కనబడ్డంలేదా. దీపాలెందుకు వెలుగుతున్నాయి" అని ప్రశ్నించేరు అమ్మగారు.

వెలుగుతున్న దీపాలవేపు అప్పుడుస్పష్టంగా చూసింది పైడమ్మ. పైడమ్మకు అప్పుడర్థమయింది. ఆ దీపాలు మామూలు యిత్తడి కుందుల్లో వెలుగుతున్నాయి. అక్కడ వాటిస్తానే వెండికుందులుండాలి. అవిలేవు.

"ఏవండమ్మగో.. ఎండికుందు లేవండమ్మగోరు" అని చాలా అమాయకంగా, చాలా అత్యాశ్చర్యంగానూ అడిగింది పైడమ్మ.

"అయ్యో నేనూ అడుగుతున్నాను. పూజ సామాను నువ్వెప్పుడు తోమావు" అని ప్రశ్న వేశారు అమ్మగారు.

"మొన్న" అంది పైడమ్మ. "కాదం"ది. "మొన్నకాదు. మొన్నకాదాండమ్మాగోరు .. అటుమొన్న. అవును .అటుమొన్నే" అని నిర్ధారణచేస్తూ చెప్పి అమ్మగారివేపు చూసింది పైడమ్మ.

"నువ్వు పని ఏయేరోజులు ఎగ్గొట్టావో గుర్తుందా" అని అడిగారు అమ్మగారు.

"ఆయేళ .ఈ పూస్సావాను తోఁవీసి ఎళ్ళిపోయే పైడీ' అంటే నానూ పూస్సావాను తోఁవీసి మీకప్పజెప్పి ఎళిపోయేను అంతే ఆ రోజు నానే తోవేను ఎండికుందుల్ని. ఆ ఎండి కుందుల్ని ఆరోజు మీరిచ్చిన అదేదో గుండ, ఆ గుండతోబాగా తళాతళా తోఁవేనే ఆ పూస్సాఁవాను ఆరోజు మీ కప్పజెప్పేసే నేను యెళిపోయేను" చెప్పడం ఆపేసింది పైడమ్మ.

"పైనున్న మూడ్రోజులూ పూజగదిలో కెళ్ళలేదునేను. ఈవేళ తీరా పూజ చేసుకునే సమయానికి జత వెండికుందులూ కనబడ్లేదు. ఇల్లంతా వెదికినా ఏవీ? ఎక్కడ ఇంట్లో వుంటేనా కనబడ్డానికి" విషయంచెప్పి పైడమ్మ వేపు సంశయంగానూ, దీనికి జవాబేం చెబుతా వన్నట్టుగానూ చూసారమ్మగారు.

"పూస్సాఁవాను తోఁవేసి ఆ గదిలో ఎట్టేయే పైడీ అంటే ఆ సాఁవాను తోఁవేసి ఆ గదిలో ఎట్టేసి ఆ పూజ గది గొళ్ళెం పెట్టేసి ఎళిపోయానంతే . అంతేనండమ్మగోరు ఆ తర్వాత నానెరగను" అన్న మాట అంది పైడమ్మ.

"నువ్వెరగకపోతే, ఆ సామానెట్టికెళ్ళిపోడానికి ఎవరో కొత్త దొంగ వొచ్చి ఎత్తుకుపోయారంటావా ఈ మూడ్రోజులూ ఆ గదిలోకి పిల్లలుగాని, నేను గానీ ఎవరూ వెళ్ళలేదు. తీరా ఇవాళ చూస్తే " అని అమ్మగారు ఆగారు.

"గదంతా ఎతికిరా . ఆటకు పిల్లలీస్తారేఁవో" అని భయం భయంగా నోట్లో సొణుక్కున్నట్లుగా అంది పైడమ్మ.

"తెల్లవార్లావునించీ నేన్చేస్తున్న పనదే. ఎతకటవే పిల్లలీసారా అండానికి నా అనుమతి లేకుండా ఆ గదిలో కెళ్ళరు. వెళ్లినా ఆ పూజ సామాను ముట్టుకునే అవసరం వాళ్ళకేవుంది? 'నన్నడక్కుండా వాళ్ళేం అలాంటి పన్లు చెయ్యరు."

"అయితే అయ్యేటయ్యుంటాయండమ్మ

గోరూ . "

"ఏటయ్యాయా. రెక్కలొచ్చి ఆకాశం లోకి ఎగిరిపోయాయ్. నట్టం నేర్చుకుని పైటకు పారిపోయాయ్. ఏటౌతాయే ముచ్చటగా వున్నాయని, ముద్దుగా వున్నాయని ఎవరో చెయ్యాలని చేసిన పనిది. మా అమ్మగారికి మా అమ్మమ్మగారు ఎంతో ప్రేమగా ఎప్పటివో అవి రాజుల రాజ్యాల కాలంనాటివి, అవి ఈనాటి వెండితో చేసినవి కూడా కాదు, ఇచ్చార్ట. మా అమ్మగారేవో మా పెద్దక్కగారికి, కాశ్మీరు కాపరానికెళిపోయే ముందు ఇచ్చేస్తే, అవి తనకు కావాలని, ఆ రెండు వెండి కుందులూ తనకివ్వమంటే నా దగ్గరకంటే నీ దగ్గరే జాగర్తెక్కువని, నాకంటే నీకే భక్తెక్కువని, భక్తెక్కువ కాబట్టి ఆ జత వెండి కుందులూ నీ దగ్గరుంటేనే బావుంటుందని, ఆ కాశ్మీరక్క తను కాశ్మీరు వెళ్లిపోయే ముందు ఈ చిన్న చెల్లిగారికిచ్చిందట. అలాగా ఆ వెండికుందులు తన దగ్గరికి అంత కష్టంమీద వచ్చాయిట. అదట ఆ వెండికుందుల వైనం ."

"తొవడానికి నీకివ్వడమే తప్ప, ఆ తర్వాత నా కళ్ళతో నేను చూడలేదు. అంచేత అవ్వేటయ్యాయో నీకే తెలియాలి. ఎహా తెస్తావో ఏం చేస్తావో సాయింత్రంలోగా కుందులెండూ తెచ్చి నాకిచ్చి, ఆ తర్వాత పన్లోకిరా. వెళ్లు" అని తను చెప్పదల్చుకున్నది సూటిగానూ, స్పష్టంగానూ చెప్పేరు అమ్మగారు.

అమ్మగారు చెప్పిద్దానికి పైడమ్మ గజగజ వణికిపోయింది. అంతకుముందే బస్టేండు నుంచి పరుగెత్తిరావటం వల్లనో లేక, ఇంత నింద మీదపడ్డంవల్లనో లేక ఇలాంటి పరిస్థితి ఎదురైందేవి చెప్మా అనే భయంవల్లనో పైడమ్మ శరీరం ఆకులా గజగజా వణికిపోయి చెమట పట్టేసింది. అమ్మగారితో ఏం చెబుదా వనుకున్నా పైడమ్మకి నోరు పెగల్లే. ఆయమ్మకోసారి ముఖం తిరిగినట్టనిపించింది భూమి కదిలిపోయి, నేలంతా చుట్టుకుపోయి తనని కప్పేస్తున్నట్టనిపించింది. ఏం చెప్పాలో



తెలీక పైడమ్మ అలా బొమ్మలా నిలబడి పోయింది. ఆయమ్మకోసారి తన రిక్షా పెనిమిటి, తనిద్దరి "ముండపాపలూ", ఆరేళ్లు నిండిన కొడుకూ గుర్తొచ్చేరు. ఆయయ్య కాళ్ళూ, ఆయమ్మ కాళ్ళూ పట్టుకుని ఎదిగిన కూతురు సీతాలుకి మున్సిపలాఫీసు బంట్రోతు సంబంధం కుదిర్చి, నిన్నగాక మొన్ననే పెళ్ళి చెయ్యడం గుర్తుకొచ్చింది. బొట్టెకి మూడు ముళ్ళేయించేసి "అత్తారింటి"కి అంపించాననే కన్నతల్లి సంతోషవింకా తీరనేలేదు. ఈ అపనింద మీదబడింది. కనబడ్డం లేదంటే తను ఎత్తికెళ్లిందన్న మాటేగదా. ఎత్తికెళ్లిందంటే తను దొంగతనం చేసిందన్న మాటే. అంటే తను దొంగదన్నమాట ఆ ఆలోచన తలలో మెదిలేసరికి పైడమ్మ తల నరాలన్నీ జివ్వుమన్నాయి. కాళ్ళనించి తలదాకా వళ్ళంతా తిమ్మిరెక్కినట్టనిపించింది.

"నాను దొంగదాన్ని మాత్తరం కాదండమ్మగోరు. ప్రేమించానన్జెప్పి తల్లిని తను కడుపల పడ్డాక వదిలీసి తనబాపు ఎళిపోతే తనని కని పారేసి చూడకుండా తల్లెలిపోతే ఎక్కడ పెరిగిందో తెలీకుండా వూహ వచ్చిన్దాకా తను పెరిగినా, ఆనాడైనా తనకి దొంగతన మబ్బలేదండమ్మగోరు వూహ తెలిసాక బతకడమెలాగరా అని కూకుంటే టీకొట్టు సింవాచలం సేరదీస ఇంటింటికీఇడ్లీలమ్మే అని తన కొదారం సూపట్టిన్నాడైనా దొంగతనమబ్బ లేదండమ్మగోరూ ఇడ్లీలు దగ్గర సేరికైన రిక్షామావ, ఒలే పైడీ మనిద్దరవూ మను వాడుదావంటే. ఆనాడైనా దొంగతనంగా ఆడి దగ్గరికి నేను సేర్లేదు. పప్లిగ్గా కోవెల్లో నా మెళ్లో మూడుముళ్లూ ఏసినాదాడు. బతికనేక ఆళింటిదగ్గరా. ఈళింటి దగ్గరా ఇంటి నలుగురం చాకిరిసేస్తున్నాం తప్ప దొంగతన మెరగమండమ్మగోరు" తన జీవితాన్ని ధైర్యంగా, నిర్భయంగా అమ్మగారి ముందుంచింది పైడమ్మ. తనమీద నిందపడినందుకు పైడమ్మ కడుపు తరుక్కుపోతోంది. ఆవిడ కళ్లు చెరువైపోయాయి. ఆ కళ్ళంట కారే కన్నీళ్ళని ఆయమ్మ తుడుచుకోపోవటంవల్ల అవి జాకెట్టులేని ఆయమ్మ గుండెమీద అడ్డుగా వున్న పైటమీద ఇంకిపోతున్నాయి. అంత చెప్పినా పైడమ్మ దుఃఖవింకా ఆగలేదు.

"ఓ రోజుకాదు, రెండ్రోజులు కాదు... ఎనిమిదేళ్ళే ఎరుగుదురు నా నెలాంటిదాన్నో ... ఆకల్తో సచ్చానేకాని అడక్కుండా తిన్నేదు. అమ్మా ఆకలనడిగేనేగాని ఒప్పుడూ ధయిర్యం చేసెరగను. నానూ, నా పిల్లలూ, మావందరూ మీకు తెల్సు. ఎలాటోల్లవో మీకు తెల్సు. అన్నీ తెల్సిన మీరే . మమ్మల్నిన్నాళ్ళూ పెంచిన మీరే "దొంగనంజ"నని ముద్దర ఏసినారు. ఇంకా ఏ గంగలో పడల మేంవు . నాయం మాకు వొవుడు సెబుతాడు" అని కనబడని ధైర్యమేదో పైడమ్మలో ఆవహించి, అమ్మగార్ని నిలదీసి అడిగింది.

పైడమ్మ అన్నదానికి, పైడమ్మ పడ్డ బాధకి అమ్మగారేం చలనం చెందలేదు సరిగదా, ఆ మాటల్నాఎడ ఖాతరు చెయ్యనట్టవుపించేరు. అంతసేపూ పైడమ్మ మాటలు అమిత శ్రద్ధగా విన్న అమ్మగారు ఆఖరుసారిగా పైడమ్మనో మాట అడిగారు.

"చూడు పైడమ్మా నువ్వు నిజం చెబుతున్నావో, అబద్ధం చెబుతున్నావో నాకుతెలీదు. నువ్వు దొంగతనం చేసావని కూడా నేనన్ను. కానీ ఎవరూ తియ్యకుండా ఇంట్లో వస్తువు పోదుకదా' ఇంట్లో వెతికేను ఎవరయినా చూసారేమోనని అందర్నీ అడిగేను. పూజ గదిలో సామాను ఎవడు తీస్తాడు? ఆ రెండు కుందుల్నీ ఆరోజు నువ్వు చూసాక మేమెవరం చూడలేదు. నువ్వే ఆఖరుసారిగా చూసేవు. అవునా అవును. అయితే ఆ తర్వాత అవ్వేటయ్యాయి? అది తేలాల్సింది అవునా అవును. అంచేత ఆ విషయమేదో తేల్చదల్చుకున్నాను కాబట్టి, అదేదో తేల్చే అని అయ్యగారు కూడా చెప్పేరు కాబట్టి ధర్మపురి బైరాగి దగ్గర "అంజనం" వేయిస్తే అందులో ఎత్తుకెళ్లిన మనిషి కనబడిపోతుంది. నిజం తెలిసిపోతుంది. మన జోగులుగాడ్నిప్పుడు పంపుదామనుకుంటున్నాను" అని పైడమ్మతో చెప్పి

జోగుల్ని కేకేసి మళ్ళీ పైడమ్మతో "చూడు పైడమ్మా వాడితో 'అంజనా'నికి మా బేబీని గాని, నీ చిన్నకూతుర్నిగాని పంపిద్దామను కున్నాను. కానీ ఇద్దర్నీ వద్దు. మనిద్దరికీ సంబంధం లేనివాడ్నొకడ్ని ఏర్పాటు చేస్తాను. అప్పుడు మనకేవీ అనుమానాలుండవు" అని చెప్పి "ఓరే జోగులూ! ఎదురింటి మాస్టుగారి చిన్నబ్బాయిని ఎస్. టీ. ఓగారి భార్యగారు ఓ సారి రమ్మన్నారని తీసుకురారా" అని కేక వేసారు.

"అవునమ్మా. మాఁవు దొంగోళ్ళం అవునమ్మా మేఁవు దొంగోళ్ళవేనమ్మా మంచికిరోజుల్లేవమ్మా నాయేఁకివి దినాలు కావమ్మా ఇవి అన్నేయేఁకి రోజులు . ఇంత శతపోరు పెట్టినా మీరినుకోకుండా మాఁవు దొంఁగోళ్ళఁవేనని నిశ్చేపరిచేసారన్న మాట దొంగోళ్ళవేనమ్మా దొంగోళ్ళఁవే...ఎలాగా మా మీద చోరీతనవంటగట్టేరు కనక అంజి నాలు, అస్త సాముద్దిరికాలు ఏయిస్తానంటు న్నాప గనకా, అయ్యేయించే ముందర నాదో మాట ఇనుకోండమ్మగారు. అయ్యేయించే ముందు కార్లో మీరే మా గుడిసెకొచ్చి సూసు కోండి నిజానిజాలు మీరే ఇచారించుకోండి" అని పైడమ్మ కళ్లు తుడుచుకొని మళ్ళీ అంది: "నా పిల్లల మీద ఒట్టేసి సెబుతున్నానమ్మా. నానేం మీ వొస్తువు సంగతెరగను" అనేసి మరి లాభం లేదని తెల్సుకొని. "ఎ కర్ర నగ్గుంచే ఆ కర్ర కాలుద్ది" అనేసి నూతి గట్టునో మూల కూర్చుని ఏడ్డం మొదలెట్టింది పైడమ్మ.

జోగులు ఎదురింటి మాస్టుగారి చిన్న బ్బాయిని తీసుకొచ్చేడు. ఆ వెనువెంటనే అమ్మగారు, అయ్యగారి నడిగి ఓ ఐదు రూపా యలు తీసుకుని అంజనం వేయించడానికి ఖర్చుకి జోగులికిచ్చేరు. ఆ పిదప మాస్టుగారి చిన్నబ్బాయితో సహా జోగులు ధర్మపురి బైరాగి దగ్గరకి సైకిల్ మీద బయల్దేరేడు.

నూతిగట్టు నానుకుని కూర్చున్న పైడమ్మ అలా నూతి గట్టునే చాలాసేపు మతిలేనిదాన్లా కూర్చుండిపోయింది. రోహిణి కార్తిలో నడి రోడ్డుమీద మొహం తిరిగి పడిపోయినదాన్లా కూర్చుండిపోయింది. దిక్కూ దివాణం లేకుండా ఎడార్లో ప్రయాణం చేసే ఒంటరి పక్షిలా కూర్చుండిపోయింది. అలా ఎంతసేపయిందో. తెలీదు.

మధ్యాహ్నం రెండైంది.

ధర్మపురి నుంచి జోగులొచ్చాడు. జోగుల్తో వెళ్ళిన ఎదురింటి మాస్టారి కొడుకూ వచ్చేడు అప్పటికే ఈ విషయం తెల్సి ఈ పైనంపట్ల కుతూహలంగా ఎప్పుడెప్పుడని కాసుక్కూ చున్న అమ్మలక్కలు "ఏవైందేవైందంటూ" బిలబిలా వచ్చేరు. అమ్మగారు లోన్నించి "ఒసేవ్ .. పైడీ! ఇల్రాయే . వున్నది వున్నట్టు మేస్టారి కొడుకు చెబుతాడు విను " అని కేకేసారు.

"ఉదయాన్నే ఎవడి మొకం సూసాన్రా బగవంతుడా, ఇలాటి సిక్కొచ్చి పడినాది ఇలాటి మచ్చొచ్చి పడినాది. నిప్పులా బతికి నానిమీద నీడ పడినాది" విచారించి, వూపిర్ని బిగపట్టుకుని నూతి గట్టుమీంచి లేచింది పైడమ్మ.

ధర్మపురి బైరాగి వెళ్ళగానే వున్నాట్ట. మాస్టుగారబ్బాయిని వెళ్ళిన వెంటనే నూతిలో నీళ్లు తోడి కాళ్ళూ చేతులూ కడుక్కోమన్నాట్ట. ఆ పిదప తనూ కాళ్ళూ చేతులూ కడుక్కుని వచ్చి కూచున్నాట్ట. మాస్టుగారి కొడుకుని తన కెదురుగా కూర్చోబెట్టుకుని, తన అరచేతిలో కాటుకని చందమామలా గుండ్రంగా దిద్దుకుని,

"సూసింది సూసినట్టుగా సెప్పబ్బాయ్" అన్నాట్ట. జోగులు చెబుతున్నదాన్ని విని అక్కడ్నించి మేస్టుగారబ్బాయిని అడగటం మొదలెట్టారు అమ్మలక్కలు.

"నా చేతుల్ని కళ్ళకు అటూ యిటూ పెట్టు కోమన్నాడండి."

"తర్వాత?"

"కాటుక రాసుకున్న తన అరచేతిని నా కళ్ళ ముందుంచేడండి."

"తర్వా త్తర్వాత?"

"అంతా చీకటిగా లైట్లారిపోయినట్టవుపిం చిందండి."

"తర్వాత నాయనా ?"

"అందులో కనబడింది కనబడినట్టుగా చెప్ప మన్నాడండి ఆ బైరాగి" మధ్యలో జోగులు అడ్డం వచ్చేడు.

"నువ్వూరుకోరా. " అమ్మగారు గసిరేరు.

"నువ్వు చెప్పు బాబూ "

"ఆ చీకట్లో ముందు యిల్లు కనబడింది."

"ఎవరిల్లు బాబూ?"

"ఇల్లా...మేడా?"

"ఈ మేడే కనబడిందండీ."

"పూజా మందిరం కనబడిందండి."

"పూజా మందిరమే!"

"పూజా మందిరంలోకి ఒకావిడ వెళ్ళటం కనబడింది."

"ఆడమనిషా.. మగోడా?" ఎవరిదో ప్రశ్న.

"ఒకావిడని అంటుంటే, ఆడమనిషా, మగ మనిషాని ఏవిటా చిత్రాంగి ప్రశ్నలు?" ఎవరో పెద్దావిడ విసుక్కుంది.

"పూజామందిరం దగ్గరున్న వెండికుందు రెండూ చేతిలోకి తీసుకుని బైటకొచ్చేసి, అటూ ఇటూ చూసి నూతిగట్టు వేపున్న రేకు తలుపు వేపు వెళ్లిందండి."

"ఆ ఆడమనిషి కనబడిందా బాబూ?"

"కనబడిందండి పైడమ్మలాగే వుందండి పైడమ్మేనండి."

పైడమ్మ మరక్కడ వుండలేకపోయింది. లేచొచ్చేసింది. లేచొచ్చేసిన పైడమ్మ జాంచెట్టు మొదట్లో కూర్చుని "నానేం దొంగతనవూ సెయ్యనేదు ఆ సూణ్నారాయణ మూరితి సాచ్చిగా నానే సోరీ ఎరగను ప్రబో" అని తల బాదుకుని, గుండె కొట్టుకుని ఏడ్చింది.

అయితే ఆ మాటలెవ్వరు నమ్ముతారు? ప్రత్యక్షంగా చూసినట్టు ధర్మపురి బైరాగి అంజనంతో పైడమ్మ రెండు కుందులూ దొంగ తనంచేసి పారిపోవడం కనబడిపోతే "నా న్తియ్య నేదు బగవంతుడా" అంటే ఎవరు నమ్ముతారు. ఎవరూ నమ్మరు.

"అయితే ఇప్పుడేం చేస్తారు?" అని ఎవరో సుభద్రమ్మగార్ని కుతూహలంగా ప్రశ్నించేరు. ఆ మాటకి అమ్మగారు—

"దొంగదాన్ని పన్లోకి తెచ్చుకోడం నాదీ బుద్ధి తక్కువ" న్నారు. ఆ మాటకి ఇంకో భామామణి—

"ఇవాళ ఇది మీ ఇంట్లో అయింది. రేపు మా యింట్లో అవుతుంది. అంచేత పోలీసు రిపోర్టివ్వండి" అని సలహా పారేసింది ఆ సలహాను ఇంకో మహిళారత్నం క్రింద పడ కుండా పట్టుకుని "అంతెందుకులెండి ఆ వెండి కుందుల ధర ఇమ్మని, పన్లోంచి మాన్పించేయండి" అని బహు భేషుగ్గా చెప్పింది.

"ఇంతయ్యాక పని మాన్పించక నువ్వే కావాలేనని వుంచుతారేటి" అని ఇంకో పన్లే నావిడ అంది.

అన్ని మాటలూ జాంచెట్టు మొదట్లో కూర్చున్న పైడమ్మకి విన్పిస్తూనే వున్నాయి. ఆ తర్వాత ఎవరో ఒకావిడ వచ్చి పైడమ్మతో "ఆ కుందు లెక్కడయినా, నీ కూతురు పెళ్లికి డబ్బు కావల్సి వొచ్చి తాకట్టు పెడితే చెప్పు పర్లేదు అమ్మగారు ఇడిపిస్తారు " అని అన్నారు. "లేకపోతే నువ్వే తీసేసినట్టు రుజువైంది కాబట్టి ఆ డబ్బిచ్చేసి పని మానీ" అన్నారు.

"అనాగేనమ్మా అనాగే. ఇంత నింద పడ్డాక ఇంతనిజం తెల్సాక పోలీసుల్ని పిలిపించి కొట్లో ఎట్టించక దయ తల్చేరు దయ గల తల్లులు. ఇచ్చేత్తానమ్మా ఇచ్చేత్తాను ఆ డబ్బు సెల్లించేత్తాను ఆ దొంగతనం నానే సేసాను ఆయమ్మ ఏయమ్మో అన్నట్టు నా కూతురి పెళ్లిసంబడానికి డబ్బు సాలక మీ యింట్లో ఆ ఐదు తులాల ఎండికుందులూ నానే ఎత్తికెల్లి అమ్మేసుకుని, సొమ్ము సేసుకుని నా దినోరం సేసుకున్నానమ్మా. నానే తీసా నల్లీ నానే తీసాను" పిచ్చిగా, వెర్రిగా, జాలిగా, హృదయ విదారకంగా రోదిస్తూ ఆ మాటలంది పైడమ్మ.

ఆ తర్వాత పైడమ్మ మొగుడ్ని పిల్చి

విషయం చెప్పి, తనకి వాయిదాలమీద డబ్బు ఇచ్చేట్టుగా ఒప్పించి, అమ్మగారు ఆ వెండి కుందుల కథను అలా పరిసమాప్తి చేసేరు.

ఇది జరిగిన వారం రోజుల్నాడు, ఆ రోజు ఆదివారం. ఆ రోజు స్కూలు సెలవవటంవల్ల సుభద్రమ్మగారి కూతురు చిన్నన్నయ్యను పిల్చి "అన్నయ్యా, దేవుడిపెళ్లి బొమ్మలాట ఆడుకుందావా?" అంది.

అన్నయ్య "వూఁ" కొట్టాడు. చుట్టు ప్రక్కల పిల్లలందరూ ఆటకు పోగయ్యేరు. కొట్టు గదిలో దాచుకున్న లక్కపిడతలన్నీ తెచ్చుకుని మేడమీద వరండా చివర కూర్చున్నారు. మూటవిప్పి, లక్కపిడతలన్నీ పేర్చి కర్రదేవుణ్ణీ, దేవతనీ తీసి నిలబెట్టారు, దేవుడికీ దేవతకీ తల్లి నడిగి నూనెతెచ్చి దీపాలు వెలిగించేరు. వుత్తుత్తి అన్నం కూరా వండుకుని వుత్తిత్తి భోజనం చేసేరు. గోల చేసారు. బట్టలారబెట్టుకోడానికి మేడమీద కొచ్చిన అమ్మగారు "ఏమిట్రా ఆ గోల"ని పిల్లల్ని గసురుతూ "పూజల్లో నన్ను మించిపోయింది నా కూతురని" ఇంటికి దీపంలాంటి ఒక్కగానొక్క కూతుర్ని ముద్దులాడ్డానికి దగ్గరకొచ్చి అక్కడ వెలుగుతూ కన్పించిన దీపాలవేపు చూస్తూ నిశ్చేష్టురాలై పోయినిలబడిపోయారు. ఆవిడకి ఆ సమయంలో మాట రాలేదు. "ఏవండీ" అనికేకేస్తే క్రిందనుంచి అయ్యగారు పరుగెత్తుకొచ్చేరు.

"ఇవి నీకెక్కడివే " అని కోపంగా అడిగారు అమ్మగారు తమ ఇంటి దీపాన్ని.

"అన్న యిచ్చేడు" అని తన చిన్నారి అన్నయ్యను చూపెట్టి క్రూరంగా ముఖం పెట్టుకొని చూస్తున్న 'అమ్మ'ని చూసి ఏడుపు లంకించింది ఇంటిదీపం.

"ఒరేయ్. నీకెక్కడివిరా?" అని చిన్నారి అన్నయ్య నడిగేరు అమ్మా నాన్నలు.

"పెద్దన్న . య్యి ..చ్చే . డు . ." అని జవాబు చెప్పేడు.

"ఒరేయ్ పెద్దన్నయ్యా...పెద్దన్నయ్యా." వాడు పరుగెత్తుకొచ్చేడు.

"ఇవి వాళ్ళకిచ్చింది నువ్వేనా?"

"అవున్నేనే. . దేవుడి పూజ బొమ్మలాట లాడుకుంటున్నాం అయ్యన్నయ్యా అంటే ఆ ఆ రోజేరోజో జ్ఞాపకం లేదు మమ్మీ. మేడ మీద ఎండుతున్న వీటిని సరదాగా ఆడుకోమని నేనే ఇచ్చేను. ఏం తప్పా " అని ఎదురు ప్రశ్న వేసేడు పెద్దన్నయ్య.

"అయితే ఆ సంగతి నాకెందుకు చెప్ప లేదు " అని అమ్మగారు కొడుకు మీద విరుచుకుపడ్డారు. విరుచుకుపడి ఆవిడ అయ్యగారివేపు పిర్గ్గా చూసేరు.

"జరిగిందేదో జరిగిపోయింది. ఈవిషయం ఎక్కడికీ పొక్కకుండా జాగ్రత్తపడండి" అని కళ్ళతోనే అమ్మగార్ని ఓదార్చి క్రిందకు వెళ్లిపోయారు.

అమ్మగారి కొక్కసారి పైడమ్మ గుర్తొచ్చింది. "ఆకల్తో సచ్చానేగానండమ్మగోరు కక్కుర్తిపడి సోరీతనం సెయ్యలేద"న్న పైడమ్మ మాటలూ ఏడుపూ వినబడినట్లాయ్యాయి.

"ఈ సంగతి పైడమ్మకు తెలిస్తే " అనే ఆలోచనొచ్చేసరికి అమ్మగారు గజగజా వణికిపోయారు. వెంటనే ఇంట్లో పిల్లల్ని పిలిచి ఈ సంగతి ఎక్కడా తెలియకూడదని ఖాయిదా చేసారు.

"అయితే ధర్మపురి బైరాగి అంజనం సంగతో " ఎంత కొట్టుకు చచ్చినా ఆ విషయవేఁ ఆవిడకు అర్థం కాలేదు సరిగదా కాంండ్రు-కాంండ్రుమని దర్జా దర్పాలతో తిరిగే పెద్దపులి, షో కేసులో పెట్టిన దూదిపులిలా చాలాసేపు మౌనంగా నిశ్శబ్దంగా నిల్చుండి పోయింది. □